అడ్డదిడ్డంగా పార్కింగ్

- రోడ్డుపై సంతతో మరిన్ని సమస్యలు
- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందిపడుతున్న దుబ్బాక ప్రజలు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



దుబ్బాకలోని పాతరోడ్డులో ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనాలు

దుబ్బాకటౌన్: అసలే ఇరుకు రోడ్లు.. ఆపై ఇష్టానుసారంగా రోడ్లపైనే వాహనాల పార్కింగ్.. ఎక్కడపడితే అక్కడ ఆటోల పార్కింగ్‌తో దుబ్బాక పట్టణం ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కి కొట్టుమిట్టాడుతోంది. రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునేనాథుడే లేక ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారింది. ప్రధాన రోడ్లపై ఉన్న వ్యాపార సంస్థలకు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దుబ్బాక పట్టణం మున్సిపాలిటీగా మారడంతో వ్యాపార కేంద్రంగా మారింది. అందుకు అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. శనివారం వచ్చిందంటే తెలంగాణ తల్లి చౌరస్తా, గంగపుత్ర సంఘం రోడ్డు, బస్టాండ్, లచ్చపేట రోడ్డు, బైపాస్‌లో సంత, ఇతర వస్తువులు అమ్మడం, వాహనాల పార్కింగ్‌తో పాదచారులు కూడా నడవలేని పరిస్థితి.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

- దుబ్బాకలో రోడ్లపై అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.
- వ్యాపార సంస్థల ముందు పదుల సంఖ్యలో వాహనాలు పార్క్ చేస్తుండటంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందిపడుతున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్‌పై దృష్టి పెట్టకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారింది.

ట్రాఫిక్‌కు అంతరాయం

బస్టాండ్ నుంచి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు వాహనాలు నడపాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు పార్క్ చేస్తుండటంతో ఆ మార్గం ఇరుకుగా తయారైంది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. అలాగే తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహం వైపు వెళ్లే రోడ్డులో ఆటోవాలాలు రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పాడుతోంది. పాతరోడ్డు, కొత్త రోడ్డు ఇరుకుగా ఉండటం ఆపై వ్యాపార సంస్థలు ఎక్కువగా ఉండటంతో జనంతో కిక్కిరిసి ఉంటాయి. ఆ రోడ్లలో దుకాణాల ముందటే వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో కార్లు వెళ్లలేని పరిస్థితి.

రోడ్డుపై సంతతో..

తెలంగాణ తల్లి చౌరస్తాలో ప్రతీ శనివారం సంత జరుగుతుంది. దీంతో వందల సంఖ్యలో వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తారు. దీంతో ఆ రోడ్డు వాహనాలతో నిండిపోతుండటంతో రాకపోకలు సాగించే వాహనదారులు నానా అవస్థలుపడుతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేస్తాం



పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా తెలంగాణ తల్లి చౌరస్తాలో ఆటోలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటం, దుకాణాల ముందు ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెతోంది. వ్యాపారులను పలుమార్లు హెచ్చరించాం.

– మున్నూరు కృష్ణ, సీఐ దుబ్బాక

ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు



రోడ్లపైనే ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్టాండ్ నుంచి తెలంగాణ తల్లి చౌరస్తా, కొత్తరోడ్డు, పాత రోడ్డులో వ్యాపార సంస్థల ముందు ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటమే ట్రాఫిక్ సమస్యకు కారణం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– గన్నె వనిత, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

మరో అరుదైన శస్త్రచికిత్స

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మరో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి మహిళ ప్రాణాలు కాపాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన వంగ లక్ష్మీ సంవత్సర కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. అనేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రికి రావడంతో లక్ష్మీకి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో సర్వైకల్ గడ్డలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ చేసి 5 కిలోలకు పైగా ఉన్న ఫైబ్రాయిడ్ గడ్డ, గర్భసంచిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

ఆరోగ్యానికి వ్యాయామం చేయాలి

సీఐ సత్యనారాయణరెడ్డి



5కే రన్‌ను ప్రారంభిస్తున్న సీఐ

కొమురవెల్లి(సిద్దిపేట): ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేయాలని, ఇందుకు కొంత సమయం కేటాయించాలని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం వివేకానంద టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన 5కే రన్ ప్రారంభించారు. కార్యక్రమంలో వివేకానంద టీచర్స్ అసోసియేషన్ చేర్యాల సభ్యులు, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు పోలీసు సిబ్బంది, చేర్యాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ



అక్షింతలు తీసుకెళ్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరాముడి అక్షింతలు ఆయా గ్రామాలకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎక్కల దేవి శ్రీనివాస్, రాజేందర్, పచ్చిమడ్ల స్వామి, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన వానరానికి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీప రోడ్డుపై ఓ వానరాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందింది. దీంతో ఏఎస్ఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో వానరానికి రోడ్డు పక్కనే గుంతతీసి అంత్యక్రియలు నిర్వహించారు.

పరామర్శ

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేటకు చెందిన మన్నె లక్ష్మీ నారాయణ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రెడ్డి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాతూరి వెంకట్ రెడ్డి మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుంబాల రవిని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నారాయణ రెడ్డి, కృష్ణా రెడ్డి, లింగా రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగ్గిళ్లాపూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అధికారులు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ కేలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, ఉపసర్పంచ్ మాధవి, ఏఎన్ఎం నిర్మల తదితరులు పాల్గొన్నారు.



గాగ్గిళ్లాపూర్‌లో కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాపాలనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. రోజువారి కార్యక్రమాలను వివరించారు. గ్రామాల్లో వంద మందికి ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, వసతులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సర్పంచ్‌లు ముందు రోజు సమాచారం గ్రామస్తులకు తెలియపరచాలన్నారు.

28 నుంచి గ్రామసభలు

ఈనెల 28వ తేదీన మడద, రాములపల్లి, పోతారం (ఎస్), జిల్లెలగడ్డ, 29న మహ్మదాపూర్, ఉమ్మాపూర్, మీర్జాపూర్, భల్లునాయక్ తండా, 30న నాగారం, వంగరామయ్యపల్లి, గాంధీనగర్, తోటపల్లి, జనవరి 2న కూచనపెల్లి, బంజేరుపల్లి, పందిల్ల, పొట్లపల్లి, 3వ తేదీన మాలపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని, వీటిని ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, తహసీల్దార్ రవీందర్ పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు. సమావేశంలో సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజాపాలన సన్నాహక సమావేశం బుధవారం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాము మంగళవారం తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు మండలంలోని 23 గ్రామాల్లో నిర్వహించే షెడ్యూల్‌ను వివరించారు.

ప్రజాపాలన అవగాహన సదస్సు

కొమురవెల్లి(సిద్దిపేట): ఈనెల 28వ తేదీ నుంచి ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే అవగాహన సదస్సుకు హాజరు కావాలని ఎంపీడీఓ అనురాధ మంగళవారం తెలిపారు. రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి, చేయుత పథకాల దరఖాస్తుల స్వీకరణ విధివిధానాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

ప్రజాపాలన షెడ్యూల్ విడుదల

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన షెడ్యూల్‌ను మంగళవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 28వ తేదీన అక్కన్నపేట, గొల్లకుంట, కేశనాయక్‌తండా, పంతులతండా, 29వ తేదీన అంతక్కపేట, గుబ్బడి, జనగామ, చౌటపల్లి, 30న గొల్లపల్లి, మల్లంపల్లి,మోత్కులపల్లి, పెద్దతండా, 2న కట్కూర్, దుబ్బతండా, చాపగానీతండా, గుడాటిపల్లి, 3న మంచినీళ్లబండ, కేశవాపూర్, గోవర్ధనగిరి, బొడిగెపల్లి, 4న నందారం, మసిరెడ్డితండా, కపూర్‌నాయక్‌తండా, ధర్మారం, 5న మైసమ్మవాగుతండా, కుందనవానిపల్లి, రేగొండ, మల్‌చెర్వుతండా, 6న గౌరవెల్లి, గండిపల్లి, రామవరం, పోతారం(జె) గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు గ్రామసభల్లో ఆరు గ్యారంటీలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అధైర్యపడొద్దు భవిష్యత్ మనదే

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దని భవిష్యత్ మనదేనని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో గెలుపుఓటములు సహజమని, పార్టీ శ్రేణులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, అండగా నేను ఉన్నాని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మండల పూజ



అయ్యప్ప మండల పూజలో పాల్గొన్న భక్తులు

హుస్నాబాద్‌రూరల్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మంగళవారం రాత్రి మండల పూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తుల శరణు ఘోషతో దేవాలయం మారుమోగింది. మున్సిపల్ చైరపర్సన్ ఆకుల రజిత వెంకన్న హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి కేవల్ కిషన్

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



కేవల్ కిషన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేటఅర్బన్: వెట్టి చాకిరి నుంచి ప్రజల విముక్తి కోసం తుదిశ్వాస వరకు అలుపెరుగని పోరాటం చేసిన ప్రజల మనిషి కేవల్ కిషన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కేవల్ కిషన్ 63వ జయంతి సందర్భంగా సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కష్టజీవుల కోసం పోరాటాలు చేసిన గొప్ప త్యాగధనుడు కేవల్ కిషన్ అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం బలమైన ప్రజా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, ప్రశాంత్, జిల్లా నాయకులు శిరీష, అరవింద్, సంజీవ్, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: డ్రైవర్‌కు గాయాలు



పాక్షికంగా ధ్వంసమైన ఆటో

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. వెంటనే అతడిని 108 అంబులెన్సులో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి కర్రలోడ్‌తో కరీంనగర్ వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో రోడ్డు పక్కన ఉన్న ఆటోను ఢీకొంది. ఆటో కూర్చున్న మల్లేశం తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది.

అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం



హుస్నాబాద్‌లో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లేశ్

హుస్నాబాద్: అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడింది సీపీఐ అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ ఆవరణలో మంగళవారం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్బంధాలు, కుట్ర కేసులు ఎదుర్కొని దేశ సమైక్యత, సమగ్రత, పరిరక్షణ, లౌకికవాదాన్ని కాపాడుకునేందుకు సీపీఐ కృషి చేస్తోందన్నారు. వేలాది నాయకులు, కార్యకర్తలు ప్రజా సంక్షేమం, సమసమాజ నిర్మాణం జరగాలని తమ ప్రాణాలు త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొమురయ్య, సంజీవరెడ్డి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, నాయకులు సుదర్శనచారి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

కోహెడ(హుస్నాబాద్): భారత కమ్యూనిస్ట్ పార్టీ 99వ ఆవిర్భావ వేడుకలను కోహెడ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను కామ్రేడ్ మల్లయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి శంకర్, బాల్‌రెడ్డి, శేఖర్, అంతయ్య, రాజేశం, వెంకటయ్య, రజిత పాల్గొన్నారు.

దోపిడీరహిత సమాజమే లక్ష్యంగా పోరాటం

అక్కన్నపేట(హుస్నాబాద్): సమసమాజ స్థాపన లక్ష్యంగా, అంతరాలు లేని దోపిడీరహిత సమాజం కోసం సీపీఐ నిరంతరం పనిచేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అన్నారు. మండలంలోని గౌరవెల్లి, బొడిగెపల్లి, పోతారం(జె), జనగామ గ్రామాల్లో సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1925లో కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, మంద శ్రీనివాస్, రాజు, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సీపీఐ పోరాటం

సిద్దిపేటఅర్బన్: పేద, బడుగు, బలహీన, శ్రామిక వర్గాల రక్షణకు, వారి అభ్యున్నతికి నిరంతర పోరాటమే సీపీఐ లక్ష్యమని జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం ఎడ్ల గురువారెడ్డి భవన్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూనే రైతులు, బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, పట్టణ కార్యదర్శి బన్సీలాల్, సహాయ కార్యదర్శి ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తం ఇచ్చి .. ఆయువు పెంచి



రక్తం దానం చేస్తున్న వేణు

చిన్నకోడూరు(సిద్దిపేట): తల్లిదండ్రులు జన్మనిస్తే.. రక్తదానంతో పునర్జన్మనిచ్చిన వారవుతారన్న నానుడి. రక్తం ఇవ్వడమంటే సాటి మనిషికి ప్రాణం పోయడమే. రక్త సంబంధంలేకున్నా మానవతా దృక్పథంతో ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్త దానం చేసి ప్రాణాలు నిలబెడుతున్నాడు మండల యువకుడు. గంగాపూర్‌కు చెందిన గుండెల్లి వేణు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2010 నుంచి 2019 వరకు 108లో పైలట్‌గా పనిచేశాడు. ఆ సమయంలో ఎంతో మంది రక్తం దొరక్క చనిపోవడం చూసి చలించిపోయాడు. అప్పటి నుంచి రక్తదానం మొదలు పెట్టాడు. ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేశాడు. సమాజసేవ చేసినందుకు రెండు సార్లు జిల్లా ఉత్తమ సేవా అవార్డు పొందారు. ఎక్కడి నుంచైనా సమాచారం అందగానే వాట్సాప్ వేదికగా మిత్రులకు చేరవేస్తాడు. దగ్గరలోఉన్న వారి వివరాలు తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి రక్తం ఇచ్చేలా ప్రోత్సహిస్తాడు. తాను రక్తదానం చేస్తూ దాతలను సమన్వయం చేస్తూ 500 మందికి పైగా ప్రాణాలను కాపాడాడు.

ఉచిత పశువైద్య శిబిరం

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగాపూర్‌లో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి నిహారిక మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ పార్టీ నుంచి సస్పెండ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బైరగోని శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మంగళవారం పార్టీ మండలాధ్యక్షుడు సాంబరాజు తలిపారు. పార్టీ నిర్ణయాలకు, క్రమశిక్షణకు ప్రతీఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదన్నారు.

◆ ప్రజాపాలనపై అవగాహన సదస్సు

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మంగళవారం తెలిపారు. ఉదయం 10.30కు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి మండల, అసెంబ్లీ ప్రత్యేక అధికారి హాజరవుతారని, సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

◆ ఆరు గ్యారంటీలపై అవగాహన

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆరు గ్యారంటీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లతాన రేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

◆ ఎస్‌జీఎఫ్ పరిశీలకుడిగా స్వామిగౌడ్



సిద్దిపేటజోన్: ఈనెల 28 నుంచి 30 తేదీ వరకు నాగర్ కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) పోటీలకు సిద్దిపేటకు చెందిన వెంకట్ స్వామిగౌడ్ వ్యవహరించనున్నారు. అండర్ 14, అండర్17 బాలబాలికల విభాగంలో మల్లకాంబ్ పోటీలను పర్యవేక్షించనున్నారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామేశ్వర్, ప్రతినిధులు తోట సతీష్, అశోక్, శ్రీనివాస్ ఆయనను అభినందించారు.

◆ ఈ–కేవైసీ కోసం బారులు

గజ్వేల్‌రూరల్: గ్యాస్ వినియోగదారులు ఈ–కేవైసీ(బయోమెట్రిక్) చేయించుకునేందుకు మంగళవారం గ్యాస్ డీలర్ కార్యాలయం వద్ద బారులు తీరారు. పట్టణంలోని శేషమా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు మాట్లాడుతూ ఈ–కేవైసీ(బయోమెట్రిక్) చేయించుకునేందుకు వినియోగదారులు తమ వద్దకు రావద్దన్నారు. తమ సిబ్బందే వినియోగదారుల వద్దకు వచ్చి ఈ–కేవైసీ(బయోమెట్రిక్) చేస్తారని, వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

◆ గురుకుల విద్యాలయ ప్రవేశాలు

హుస్నాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకులం ప్రవేశ పరీక్షలు ఫిబ్రవరి 11వ తేదీన జరుగుతాయని హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు 2024 జనవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారన్నారు.

◆ హిందూ వాహిని మండల అధ్యక్షుడిగా వీరేశం

బెజ్జంకి(సిద్దిపేట): హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు (సంయోజక్) బస్వరాజ్ సత్యం ఆధ్వర్యంలో మంగవారం బెజ్జంకి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు (సంయోజక్)గా అడుకని వీరేశం, తొడుపునూరి ఉపాధ్యక్షుడిగా సందీప్, ప్రధాన కార్యదర్శిగా సోమని ప్రవీణ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహసంయోజక్ బండి కిరణ్, దోనె అశోక్, దొంతరవేణి శ్రీను, బుర్ర కిషన్ పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ సీపీఐ నాయకుడి మృతి



ధర్మారెడ్డి(ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీపీఐ నాయకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరా ప్రకారం..ఈనెల 17వ తేదీన చిన్న కోడూరులో చనిపోయిన బంధువు ఇంటికి పరామర్శించడానికి బెజ్జంకి చెందిన సీపీఐ నాయకులు నిమ్మ ధర్మారెడ్డి (60) బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా బెజ్జంకి శివారులో ఆవుకు కట్టిన తాడు అడ్డుతగిలి బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడటంతో చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. సోదరుడు వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ధర్మారెడ్డి పార్థివ దేహంపై పార్టీ జండా ఉంచి నాయకులు నివాళులర్పించారు. అంత్యక్రియల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, రూపేష్, మధు పాల్గొన్నారు.